సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరం



ఎల్‌ఓసీ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్‌ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం నాగారం మున్సిపాలిటీ 18 వార్డుకు మల్లికార్జుననగర్ కాలనీకి చెందిన ఎస్. నర్సింహ్మకు రూ. 1,00,000, లోటల్‌కాలనీకి చెందిన పర్శ రాములుకు రూ. 2,00,000 ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం మంజూరైన ఎల్‌ఓసీ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. మాజీ కౌన్సిలర్లు అనంతరెడ్డి, నేతలు నిమ్మల శ్రీనివాస్ తదితరులున్నారు.

విద్యార్థుల కృషితోనే ఉత్తమ ఫలితాలు



నందీశ్వర్‌ను అభినందిస్తున్న రాక్‌ఉడ్స్ విద్యా సంస్థల చైర్మన్

పోచారం: ఐఐటీ జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ పరీక్షా ఫలితాల్లో యంనంపేట్‌లోని రాక్‌ఉడ్స్ జూనియర్ కళాశాలకు చెందిన గుజ్జుల నందీశ్వర్‌రెడ్డి 98.4 శాతం స్కోర్ సాధించి ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తన విజయానికి రాక్‌ఉడ్స్ ఐఐటీ, జేఈఈ ప్రోగ్రామ్, వ్యక్తిగత మార్గదర్శకత్వం, నిపుణులైన అధ్యాపక బృందం ప్రధాన కారణాలని చెప్పారు. నందీశ్వర్‌రెడ్డిని రాక్‌ఉడ్స్ విద్యా సంస్థల చైర్మన్ రామానాయుడు, సీఈఓ సుబ్రహ్మణ్యం బుధవారం ఘనంగా శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కృషి, పట్టుదల, ఏకాగ్రతతోనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. త్వరలో జరగనున్న ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు.

శానిటరీ సూపర్‌వైజర్ ఆకస్మిక మృతి

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్‌లో శానిటరీ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగరాజు(47) మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్, సర్కిల్ ఉప కమిషనర్ రాజు, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ మంజుల తదితరులు నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం తరుపున సహాయం అందేలా చూడటమే కాకుండా వారి పిల్లల పేరున రూ.5 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తానని మాజీ ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఆచూకీ లభ్యం

- తోటి విద్యార్థుల గొడవతో అదృశ్యం
- తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



కుషాయిగూడ: తండ్రి మందలించాడని ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైన బాలుడు హకీబ్ (11) అచూకీ లభ్యమైంది. పోలీసులు బాలుడిని బుధవారం తల్లిదండ్రులకు అప్పగించారు. కుషాయిగూడ, వాసవిశివనగర్ కాలనీకి చెందిన షేక్ జానీపాషా కుమారుడు తోటి మిత్రులతో గొడవపడ్డ విషయంపై మందలించడంలో ఇంటి నుంచి వెళ్లిపోయిన విషయం తెలిసిందే. తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మంగళవారం రాత్రి 9:30 గంటల సమయంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో తిరుగుతున్న హకీబ్‌ను అనుమానించిన వ్యక్తులు వివరాలు అడగగా.. తాను ఇంట్లోంచి వచ్చేశానని సమాధానం చెప్పాడు. దీంతో మీ తండ్రి ఫోన్ నెంబరు చెప్పమని అడగగా.. తాత ఫోన్ నెంబరు చెప్పడంతో అతడికి ఫోన్ చేసి హకీబ్ సమాచారాన్ని అందజేశారు. పోలీసులు రైల్వేస్టేషన్‌కు చేరుకుని బాలుడిని తీసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు.

వార్డు కార్యాలయం పనుల పరిశీలన

మల్లాపూర్: మల్లాపూర్ వార్డు కార్యాలయం అదనపు అంతస్తు రూ.33 లక్షలతో నిర్మిస్తున్న స్లాబ్ పనులను బుధవారం మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అదనపు అంతస్తు కాలనీ సంఘాలు, కులసంఘాలు సమావేశాలు నిర్వహించుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. మల్లాపూర్ ఏఈ స్రవంతి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ బిక్షపతి, రామారావు, బీఆర్‌ఎస్ నేతలు పీఆర్. ప్రవీణ్, దయాకర్‌రెడ్డి, శ్రీను, రఘు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి



ఇందిరమ్మ ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమంలో పట్నం మహేందర్‌రెడ్డి తదితరులు

కీసర: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం చీర్యాల, కీసరలో ఇందిరమ్మ హౌసింగ్ పట్టాల పంపిణీలో భాగంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ నేత నక్కా ప్రభాకర్‌గౌడ్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలను అర్హులైన ప్రతి ఒక్కరికి అమలు చేస్తామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో 3 గ్యారంటీలను అప్పుడే అమలు చేశామన్నారు. మరో మూడు పథకాలను ఇటీవలే ప్రారంభించామని చెప్పారు.

రూ.5 లక్షల నిధుల కేటాయింపు..

ఇళ్లులేని నిరుపేదలకోసం ఇందిరమ్మ హౌసింగ్ పథకం ద్వారా లబ్ధిదారులను గుర్తించి వారికి ఇళ్ల స్థలాలతో పాటు, ఇళ్లు కట్టుకోవడానికి రూ. 5 లక్షల మేర నిధులను కూడా కేటాయిస్తామని పేర్కొన్నారు.

గత ప్రభుత్వం పట్టాలు ఇవ్వలేదు..

టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డిలు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు అప్పటి మంత్రి మల్లారెడ్డి కీసర, చీర్యాలలో నిర్మించిన డబుల్‌బెడ్రూమ్ ఇళ్లకు పట్టాలు ఇవ్వకుండా పంపిణీ చేశారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేసిందని చెప్పారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఏఎంసీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులుయాదవ్, కీసర మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు కోల కృష్ణాయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌స్వప్నరెడ్డి, తహసీల్దార్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





ప్రమాణ స్వీకారం | కీసరగుట్ట ఆలయంలో బుధవారం ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆలయ ట్రస్టు సభ్యులు – కీసర

ఘనంగా వేణుగోపాలస్వామి రథోత్సవం



ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వేణుగోపాలస్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారికి సేవాకాలం, ప్రభోధకి ఆరగింపు, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారితో పాటు రుక్మిణీ, సత్యభామ సమేత అమ్మవారిని ప్రత్యేక రథంలో ప్రతిష్ఠించి ఊరేగించారు. ఆలయం నుంచి గ్రామంలోని ప్రధాన చౌరస్తా వరకు రథాన్ని ఊరేగించి తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు. ఊరేగింపులో భక్తుల సందడి, కోలాటం, వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయ ధర్మకర్తలు అంబారిపేట వంశీయులు, భక్తులు, నాయకులు పాల్గొన్నారు.

రూ. 20.88 కోట్లతో జిల్లా గ్రంథాలయ వార్షిక బడ్జెట్



మేడ్చల్: జిల్లా గ్రంథాలయ సంస్థ 2025–26 వార్షిక బడ్జెట్‌ను చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ప్రవేశపెట్టారు. బుధవారం మున్సిపాలిటీల్లో 14 శాఖా గ్రంథాలయాల మంజూరుకు రూ. 4 కోట్ల గ్రంథాలయ పన్ను వసూలు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఉన్న శాఖా గ్రంథాలయాల్లో మౌలిక వసతుల కల్పన, భవన నిర్మాణాల నిమిత్తం రూ.15 కోట్ల నిధులను కేటాయించారు. ప్రతి మున్సిపాలిటీలో 5 పఠన మందిరాల ఏర్పాటుకు రూ. కోటి కేటాయించారు. వివిధ పద్దులు కలిపి రూ.20.88 కోట్లతో వార్షిక బడ్జెట్‌ను రూ.15.88 లక్షల మిగులు బడ్జెట్‌తో ఆమోదిస్తూ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్‌కు పంపించారు. సభ్యులు, కార్యదర్శి సురేష్‌బాబు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యను నేర్పించాలి



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

మేడిపల్లి: విద్యార్థులు క్రమశిక్షణతో పాటు విలువలతో కూడిన విద్యను నేర్పించినప్పుడే జీవితంలో రాణించి ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు దోహదపడుతుందని, విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని మాజీ సీబీఐ డైరెక్టర్ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి విజయరత్న స్కూల్ హెలెన్ – 2025 పేరుతో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యతోనే సమాజంలో ప్రతి ఒక్కరికీ ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన అకడమిక్ టాపర్స్‌కు షీల్డ్స్, మెడల్స్‌ను ప్రదానం చేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని...

ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య



హత్యకు పాల్పడిన నిందితులు లలిత, నర్సింహ

మేడ్చల్ రూరల్: కట్టుకున్న భర్తను కాదని ప్రియుడి మోజులో పడిన ఓ మహిళ..తమ వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భావించి, ప్రియుడితో కలిసి భర్తను కడతేర్చింది. వివరాల్లోకి వెళ్తే..ఈ నెల 10న ఉదయం మేడ్చల్ పట్టణంలోని కిందిబస్తీలో ఓ ఖాళీ ప్రదేశంలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెంది పడిఉన్నట్లు స్థానికుల సమాచారంతో తెలుసుకున్న మేడ్చల్ పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని పరిశీలించారు. మృతుడి స్వస్థలం మెదక్ జిల్లా ఎస్ కొండాపూర్ తండాకు చెందిన సునావత్ రమేశ్(30)గా గుర్తించారు. గత కొంతకాలంగా మేడ్చల్‌లో నివాసం ఉంటున్నట్లు తెలుసుకున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, భార్య లలిత(28)ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. కాగా వికారాబాద్ జిల్లా నీటూరు నర్సాపూర్‌కు చెందిన నర్సింహ్మ మేడ్చల్‌లో నివాసం ఉంటూ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఇతను లలితతో సన్నిహితంగా మెలిగాడు. లలిత తరచూ నర్సింహతో ఫోన్‌లో మాట్లాడడం, కలుస్తుండడం చూసిన భర్త రమేశ్ పలు మార్లు ఆమెను హెచ్చరించాడు. దీంతో ఇద్దరి మధ్య గత కొద్ది రోజులుగా గొడవలు సాగుతున్నాయి. ఈ క్రమంలో భార్య లలిత ఎలాగైనా భర్త అడ్డు తొలగించికోవాలని భావించి ప్రియుడు నర్సింహతో కలిసి చంపేందుకు ప్లాన్ వేసింది. ఈ నెల 9న రమేశ్ మద్యం మత్తులో గొడవకు దిగగా.. లలిత పథకం ప్రకారం ప్రియుడిని ఇంటికి పిలుచుకుంది. రాత్రి 10.30 గంటల సమయంలో వచ్చిన నర్సింహ్మ 11 గంటల సమయంలో రమేష్ మెడకు టవల్ చుట్టి గొంతు నులిమి లలిత సాయంతో అంతమొందించాడు. రమేశ్ మృతి చెందినట్లు నిర్ధారించుకున్న ఇద్దరు తెల్లవారుజామున కిందిబస్తీలోని ఓ ఖాళీ ప్రదేశంలో పడేసి వెళ్లి ఏమీ తెలియనట్లు వ్యవహరించారు. 10న ఉదయం సంఘటన స్థలిని, మృతుడి ఒంటిపై గాయాలను గుర్తించిన పోలీసులు మొదట భార్య లలితను అదుపులోకి తీసుకుని విచారించగా విషయం వెల్లడైంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని బుధవారం వారిని రిమాండ్‌కు తరలించారు.

ముగిసిన పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్

రామంతాపూర్: ప్రభుత్వ జేఎన్ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో గత రెండ్రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ కళాశాలల 8వ వార్షికోత్సవాలు బుధవారం ముగిశాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఉత్సవాల్లో వివిధ పాలిటెక్నిక్ కళాశాలలు పాల్గొన్నాయి. క్రీడా పోటీల్లో ఓవరాల్ టీమ్ చాంపియన్లుగా వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల, సికింద్రాబాద్ పాలిటెక్నిక్ కళాశాల అగ్రస్థానంలో నిలిచాయి. అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్లుగా కొత్తగూడెం పాలిటెక్నిక్ కళాశాల ప్రథమ స్థానంలో నిలిచింది. విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ రేణుకారెడ్డి పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ పనులు నిలిపేయాలి

బోడుప్పల్: నివాసాల మధ్య ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను నిలిపేయాలని వాసవీనగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌బాబు, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్‌లు మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాసవీనగర్ వీధినంబర్– 6 వెనుక ఉన్న ప్రభుత్వ స్థలంలో విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు చేపడుతున్నారన్నారు. సదరు ప్రభుత్వ స్థలాన్ని కాలనీ పార్కుకు కేటాయించి ఓపెన్‌జిమ్‌ను ఏర్పాటు చేయాలని గత పాలక వర్గం దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. విద్యుత్‌లైన్ల కారణంగా రేడియేషన్ లాంటి ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. సబ్‌స్టేషన్ పనులను నిలిపేసి సదరు స్థలాన్ని పార్కుకు కేటాయించాలని కోరారు.

నేటి నుంచి సీతారామాంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

బోడుప్పల్: బొల్లిగూడ మహాలక్ష్మినగర్ కాలనీలో గురువారం నుంచి మూడ్రోజుల పాటు సీతారామాంజనేయస్వామి సహిత శివ పంచాయత, నవగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, కాలనీ అధ్యక్షుడు రూపని విష్ణు ప్రకటించారు. వారు మాట్లాడుతూ.. చాముండేశ్వరి గురుదత్త పీఠం వ్యవస్థాపకులు శ్రీరామశరణ్‌శర్మ చేతుల మీదుగా గణపతిపూజ, అఖండ దీపస్థాపన, యాగశాల ప్రవేశం, శ్రీరామ మండప ఆరాధన, ఈనెల 14న శ్రీసూక్త సహిత విజయ చండీహోమం, అష్టదిగ్బంధన మహామంగళహారతి, 15న నవగ్రహసహిత శిఖర ప్రతిష్ఠాపనోత్సవం, ప్రాణ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శ్రీకృష్ణ ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు

బోడుప్పల్: పన్నాల రవీందర్‌రెడ్డి కాలనీలోని శ్రీకృష్ణ దేవాలయం త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల 13 నుంచి 18 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ అంజిపటేల్ వెల్లడించారు. బోడుప్పల్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ.. 13న ఉత్సవ ఆరంభ స్నపనం, రక్షా బంధనం, నివేదన, 14న ధ్వజారోహణం, సామూహిక కుంకుమార్చన, 15న విద్యాహయగ్రీవహోమం, ఎదురు సన్నాహం, 16న తిరుకల్యాణోత్సవం, ఊరేగింపు, 17న శ్రీసుదర్శన నారసింహహోమం, లక్ష పుష్పార్చన, 18న సంతాన ఇష్టి, మహాపూర్ణాహుతి, 108 కలశాలతో అభిషేకం, పుష్పయాగం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ ఆత్మహత్య

ఉప్పల్: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన చందన్‌సింగ్ భార్య మమత(31)తో 12 ఏళ్ల క్రితం నగరానికి వచ్చి ఉప్పల్ హనుమసాయినగర్‌లో నివాసం ఉంటున్నాడు. వీరికి ఓ కుమార్తె (9) కుమారుడు(13) ఉన్నారు. భర్త గ్యాస్ స్టవ్‌ల రిపేరింగ్ చేస్తుంటాడు. గత కొంత కాలంగా స్థానికంగా నివసించే రాకేష్‌గౌడ్‌తో భార్యకు పరిచయం ఏర్పడింది. అది కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది. దీంతో రాకేష్ మమతను వేధింపులకు గురిచేస్తున్నాడనే ఆరోపణలున్నాయి. వేధింపులు భరించలేకే ఆమె బుధవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసిందన్నారు. మృతురాలి ఒంటిపై గాయాలున్నట్లు స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న ఉప్పల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు రాకేష్‌గౌడ్ భర్త చందన్‌సింగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలి

ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి



సెమినార్‌లో ప్రసంగిస్తున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

మేడ్చల్ రూరల్: సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరికీ అవగాన అవసరమని, విద్యార్థులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉంటూ తల్లిదండ్రులు, స్నేహితులు, సన్నిహితులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్, జేఎన్‌టీయూహెచ్ ఇన్‌చార్జి వీసీ బాలకిష్టారెడ్డి అన్నారు. మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 'సైబర్ స్పేస్‌ను భద్రపరచడం–నేటి డిజిటల్ ప్రపంచానికి ఒక సవాల్' అనే అంశంపై ఒక రోజు సెమినార్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సైబర్ దాడులను మనం సమర్థవంతంగా ఎదుర్కోవాలని, అందుకు కనీస అవగాహన మనకు ఉండాలని, మనకు ఉన్న జ్ఞానాన్ని ఇతరులకు పంచాలని తద్వారా సైబర్ దాడులను ఎదుర్కోగలమన్నారు. అంతకుముందు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఐటీ పార్కును ప్రారంభించారు. కార్యక్రమంలో వింగ్ కమాండర్ గరిగిపాటి శ్రీనివాస్, మహీంద్ర యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ బంగారు లక్ష్మి, కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్ రెడ్డి, కోశాధికారి త్రిలోక్ రెడ్డి, డైరెక్టర్ మోహన్, ప్రిన్సిపాల్ లోకనాథం, కన్వీనర్ పురుషోత్తం ప్రసాద్, కోఆర్డినేటర్లు దిలీప్ రెడ్డి, లక్ష్మి, శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లా బిల్లుల వసూళ్లపై వినతి



మున్సిపల్ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో పాత నల్లా బిల్లులను వసూలు చేయకూడదని, మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షురాలు శైలజాహరినాథ్ మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఇంత కాలం ఉచిత నల్లా కనెక్షన్లు అని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు పాత నల్లా బిల్లులు వసూలు చేయడాన్ని బీజేపీ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఉచితం అనడంతో పేద, మధ్యతరగతి ప్రజలు వేల రూపాయల్లో నల్లా బిల్లులు చెల్లించలేదని, ఇప్పుడు పాత బకాయిలు చూస్తే ఇంటిపన్ను లాగే నల్లా బిల్లులు ఉండటం ఆశ్చర్యకరం అన్నారు. బిల్లుల వసూళ్లు ఆపకుంటే బీజేపీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయం వద్ద భారీ ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. మున్సిపాలిటీ బీజెవైఎం అధ్యక్షులు వంశీవిజయ్, నాయకులు ఆంజనేయులు, మైసరి రాజు, లక్ష్మణ్, బాబుదాస్, రాగం అర్జున్, ప్రేమ్‌దాస్, సర్వేశ్వరరెడ్డి, అవినాష్‌చారి, గౌలికర్ మహేష్, బొజ్జ రాఘవరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న గౌతమ్‌రావు

ఘట్‌కేసర్: అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'సైబర్ అవేర్‌నెస్, సైబర్ హైజీన్, సైబర్ సెక్యూరిటీ'పై జాతీయస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ సహకారంతో బుధవారం వర్క్‌షాప్ జరిగింది. సీ డ్యాక్ (సీడీఏసీ) ప్రాజెక్టు లీడర్ సునీల్‌కుమార్ విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ గౌతమ్‌రావు మాట్లాడుతూ.. సైబర్ నేరాలు జరగకుండా ఫోన్‌లో తెలియని లింకులు ఓపెన్ చేయకూడదని, అపరిచిత వ్యక్తులతో సొంత విషయాలు పంచుకోకూడదన్నారు. ప్రిన్సిపాల్ పీవీఎస్ శ్రీనివాస్‌రావు, మహేందర్‌రెడ్డి, సైబర్ సెక్యూరిటీ హెచ్‌ఓడీ డాక్టర్ సుష్మ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో వ్యాపార లక్షణాలను పెంపొందించాలి



అల్వాల్: సైనిక్‌పురి భవన్స్ వివేకానంద కళాశాలలో అంతహ్ ప్రేరణ 6.0 ఎంటర్‌ప్రిన్యూర్ డెవలప్‌మెంట్ సెల్ నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ ఎడిషన్‌కు 8 రాష్ట్రాల నుంచి 178 మంది హాజరు కాగా.. ముఖ్యఅతిథులుగా టీ–హబ్ సీఈఓ సుజిత్ జాగిర్దార్, ఉస్మానియా యూనివర్సిటీ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాసాగర్‌లు హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో వ్యాపార లక్షణాలను పెంపొందించడం చాలా ముఖ్యమని, దేశానికి చాలామంది ఎంటర్‌ప్రిన్యూర్స్ అవసరం ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయన్నారు. ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ డైరెక్టర్ మీనాక్షి పద్మనాభన్, భవన్స్ వివేకానంద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీఎస్‌వీఆర్‌కే. చౌదరి, ఈడీ సెల్ కో–ఆర్డినేటర్ తిరుమల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నో యూ టర్న్ !

తీవ్ర ఇబ్బంది పడుతున్న వాహనదారులు



హబ్సిగూడ చౌరస్తా వద్ద..

హబ్సిగూడ: హబ్సిగూడ చౌరస్తాలో నిరంతరం ట్రాఫిక్‌తో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. హబ్సిగూడ వాహనదారులు నాచారం, ఉప్పల్ వైపు వెళ్లాలంటే తార్నాక వైపునకు వెళ్లి యూటర్న్ తీసుకోవాల్సి వస్తుంది. జెన్‌ప్యాక్ట్ వరకు వెళ్లి యూటర్న్ తీసుకోవాల్సి వస్తుందని, దీంతో సమయం వృథా అవుతుందని వాహనదారులు వాపోతున్నారు. 4 కూడళ్లకు గతంలో రాకపోకలు సాగించారు. ప్రస్తుతం హబ్సిగూడ వైపు మార్గాన్ని మూసేయడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. 4 బస్తీలకు చెందిన సుమారు 10 వేలమంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మాదిరి హబ్సిగూడ నుంచి నాచారం, ఉప్పల్ వైపు వెళ్లే వాహనాలకు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మల్లన్న దేవాలయంలో ప్రత్యేక పూజలు



గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ మల్లిఖార్జుననగర్‌లోని మల్లన్న దేవాలయంలో శ్రీచక్రం ప్రతిష్ఠ సందర్భంగా లలితాపారాయణం బృందం నిర్వహించిన సువాసిని పూజా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. లలితాపారాయణ గ్రూప్ ఆధ్వర్యంలో 108 లలితా పారాయణాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. అనంతరం గోపిశెట్టి కృష్ణారావు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.